
గోల్నాక లంక బస్తీల్లో..

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

- అభివృద్ధి పైనే ప్రచారం
- పలు కాలనీలు, బస్తీల్లో విశేష స్పందన

అంబర్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ఓటు వేయాలని ఆ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన గోల్నాక డివిజన్ లంక బస్తీల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హారతులు పట్టారు. ప్రజా సమస్యలు పట్టని ఇతర పార్టీల నేతలు చెప్పే మయామాటలు నమ్మవద్దని ఓటర్లను కోరారు. మీ కుటుంబసభ్యునిగా మీ సమస్యలు తీర్చే నాయకుని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోల్నాక డివిజన్ లంక బస్తీ ఓటర్లు తన గెలుపులో కీలకం కావాలని కోరారు.

భర్తకు మద్దతుగా కాలేరు పద్మ ప్రచారం

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ సతీమణి కాలేరు పద్మ భర్త గెలుపు కోసం తనవంతు తోడ్పాటు అందిస్తున్నారుది. ఆమె గతంలో గోల్నాక డివిజన్ కార్పొరేటర్‌గా వ్యవహరించడంతో ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో స్పష్టత ఉంది. తన పరిచయాలను వినియోగించుకుని భర్త గెలుపు కోసం తనవంతు పాత్ర పోషిస్తుంది. మంగళవారం డీడీ కాలనీలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు.

తండ్రి కోసం తనయుడు..



నల్లకుంట: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ తనయుడు కాలేరు మణికంఠం మంగళవారం నల్లకుంటలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా న్యూనల్లకుంట, రామాలయం వీధి, నరేంద్ర పార్క్, మదర్ డెయిరీ పార్స్, నారాయణ కాలేజీ లేస్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గడిచిన ఐదేళ్లలో నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రచారంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం రమేష్, డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు ఎం.భూపతి నాథ్, సీహెచ్. సాయిమోహన్, భాస్కర్ గౌడ్, అడ్వకేట్ సత్యనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

ముషీరాబాద్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. మంగళవారం బీ జేపీ ముషీరాబాద్ అభ్యర్థి పూస రాజుకు మద్దతుగా ఆయన రోడ్‌షో నిర్వహించారు. మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో విసుగు చెందిన ప్రజలు రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీని బలపరుస్తున్నారన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రంలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పూస రాజు మాట్లాడుతూ ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీకు అండగా ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు.

'ఫర్ పీపుల్ హు మూవ్' లో అఖిల్ అక్కినేని

సాక్షి సిటీబ్యూరో: వినూత్న మార్గాలను ఎంచుకుని చరిత్ర సృష్టించే వ్యక్తుల విజయగాథల్ని తెలియజెప్పేందుకు యూకేకి చెందిన ప్రముఖ పాదరక్షల బ్రాండ్ ఫిట్‌ఫ్లాప్ 'ఫర్ పీపుల్ హు మూవ్' పేరిట సరికొత్త ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది ఈ ప్రచార కార్యక్రమంలో టాలీవుడ్ హీరో అఖిల్ అక్కినేని, ఫ్యాషన్ రంగానికి చెందిన నందినీ భల్లా, వెడ్డింగ్ ఫొటో గ్రాఫర్ జోసెఫ్ రాధిక్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఇది నిర్వహిస్తున్నామని మెట్రో బ్రాండ్స్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు.



అంతుపట్టని యువ ఓటర్ల నాడి

- జీహెచ్ఎంసీ యంత్రాంగం ప్రత్యేక చొరవతో భారీగా నమోదైన కొత్త ఓటర్లు
- కొత్త ఓటర్లకు ప్రభావితం చేసే అంశాలపై నేతల సందిగ్ధం
- యువ ఓటర్లను అంచనా వేయలేకపోతున్న ప్రధాన పార్టీలు
- 30 శాతం యువ ఓటర్లే

అంబర్‌పేట్: అంబర్‌పేటలో యువ ఓటర్ల నాడీ అంతు పట్టడం లేదు. వారి నాడిని పట్టుకోవడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల తేదీ సమీస్తున్న నేపథ్యంలో వారిని ఆకట్టుకునేందుకు యువ సమ్మేళనాల పేరిట ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 2.70 లక్షల ఓటర్లలో 30 శాతం యువ ఓటర్లే కావడం గమనార్హం. గత ఏడాది నుంచి జీహెచ్ఎంసీ యంత్రాంగం ఓటర్ నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. విద్యా సంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్‌గా పేరు నమోదు చేసుకోవాలని సూచించింది. అంతేకాకుండా పాఠశాల స్థాయిలో సహితం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రత్యేకంగా చేపట్టారు. దీంతో కొత్త ఓటర్ల సంఖ్య భారీగా నమోదైంది.

ఎటు వైపు మొగ్గు...

కొత్త ఓటర్లుగా నమోదైన యువత ఈ ఎన్నికల్లో మొదటిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరు స్థానిక పరిస్థితులు, రాష్ట్ర, దేశ స్థాయి రాజకీయ అంశాలతో ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. సోషల్ మీడియాకు సహితం యువత ఆకర్షితులై అటు వైపు మొగ్గు చూపే అవకాశం లేకపోలేదు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గత ఐదేళ్లలో యువతతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఉచితంగా పోలీస్ శిక్షణ కోసం యువతకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా సామూహిక వేడుకలకు యువతకు అన్ని విధాలగా అండగా ఉన్నారు. కాంగ్రెస్ సహితం రాష్ట్ర స్థాయిలో చేస్తున్న ప్రచారానికి యువత ఆకర్షితులయ్యే అవకాశం లేకపోలేదు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభావంతో కొందరు బీజేపీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

మిగతా ఓటర్లపై స్పష్టత..

యువ ఓటర్ల నాడీ అంతు పట్టని ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇతర ఓటర్లపై కాస్తా అంచనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు లబ్ధి దారులు తమవైపే ఉన్నారని ధీమాగా ఉన్నారు. వృద్ధులను బీఆర్ఎస్ అభ్యర్థి తమ ఓటు బ్యాంకుగా భావిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి తమ ఆరు గ్యారంటీలతో అన్ని విధలా వారు తమ వైపుకు మొగ్గు చూపుతారని భావిస్తున్నారు. బీజేపీ అంబర్‌పేటలో మెరుగైన ఓటు బ్యాంకు ఉందని అదే తమను విజయ తీరాలకు చేరుస్తుందని ధీమాగా ఉన్నారు.


నారాయణగూడలో ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి

- పలు ప్రాంతాల్లో పాదయాత్ర
- ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం

కాచిగూడ: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అధిష్టానం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ నారాయణగూడలో పార్టీ జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, మహిళా నేత దేవిరెడ్డి విజితారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఇంటికి పంపేది ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, తెలంగాణలో సామాజిక అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సహాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్లను అందిస్తామన్నారు. చేయి గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హరితిలక్ సింగ్, కోమల్ సింగ్, అనిత, రమేష్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

సకుటుంబ సపరివార సమేతంగా..



అంబర్‌పేట్: ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి గెలుపు కోసం ఆయన కుటుంబం సర్వ శక్తులు ఒడ్డుతోంది. అంబర్‌పేటలో తక్కువ సమయంలోనే ప్రధాన పోటీదారుడిగా నిలిచారని చర్చకు తీసుకు వచ్చారు. రోహిణ్ రెడ్డితో పాటు అతని తండ్రి డాక్టర్ ముత్యంరెడ్డి, భార్య నందితారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. రోజువారి షెడ్యూల్ ఖరారు చేసుకుని తమదైన శైలిలో గెలుపు కోసం దూసుకుపోతున్నారు. మంగళవారం కాంగ్రెస్ మహిళా నేతలతో కలిసి నందితారెడ్డి పలు కాలనీల్లో ప్రచారం చేశారు.

బీజేపీ మహంకాళి జిల్లా మహిళామోర్చా నేత రాజీనామా

కాంగ్రెస్‌లో చేరనున్న కొలన్ పద్మజారెడ్డి

చిక్కడపల్లి: సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, నగరంలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల మహిళా మోర్చా ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ కొలన్ పద్మజారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని తేలడంతోనే తాను బీజేపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. పరోక్షంగా బీఆర్ఎస్ గెలుపునకు బీజేపీ సహకరిస్తోందని ఆరోపించారు. గతంలో టీఆర్ఎస్‌లో ఉన్న తాను తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరగడం లేదనే బాధతో టీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరినట్లు తెలిపారు. బండి సంజయ్ ఒక దశలో రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలవడంతోనే ఆయనను పక్కన పెట్టి కిషన్‌రెడ్డికి పగ్గాలు ఇచ్చారని విమర్శించారు. ఎన్నికల వేళ బీసీని సీఎం చేస్తామని చెబితే ప్రజలెవరూ నమ్మరన్నారు. గెలుపు గుర్రాలకు టిక్కెట్లు ఇవ్వకపోవడాన్ని బట్టి పరోక్షంగా బీఆర్ఎస్ గెలుపునకు బీజేపీ సహకరిస్తోందని అర్థమవుతుందన్నారు. తన భర్త, తండ్రి తెలంగాణ ఉద్యమంలో రెండు నెలలు జైలుకెళ్లారని తెలిపారు. తన భర్త ప్రస్తుతం తమకు కాంగ్రెస్ పార్టీ ఒక్కటే సరైన దిశలో పయనిస్తున్న పార్టీగా కనిపిస్తోందని కాంగ్రెస్‌లోకి చేరాలని యోచిస్తున్నట్లు తెలిపారు.

ఓటు వేయకుంటే ప్రమాదకరమే!


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

- ఓటును సద్వినియోగం చేసుకోవాలి
- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు

కాచిగూడ: ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం లాంటిదని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్ రావు అన్నారు. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామరెడ్డి మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు చేపట్టిన ఓటర్ల అవగాహన జాగృతి ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ వామన్‌రావు మాట్లాడుతూ... విద్యావంతులైన యవత ఓటు వేయడానికి ఆసక్తి చూపడం లేదని, బాధ్యత కలిగిన పౌరులు ఓటు వేయకుండా నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు మంచి నాయకుడితోనే సాధ్యమన్నారు. ఓయూ డైరెక్టరేట్స్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మొహ్మద్ అక్తేర్ ఆలీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతదేవి, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ చైర్మన్ బత్తుల హేమంత్ , రుమీల సీతారాం, సంజన, కుమతి గుజ్జరీ అధితి, గడ్డం రిషిక యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై అవగాహన తప్పనిసరి


ఆకడమిక్ హైట్స్ పాఠశాలలో బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న షీటీమ్స్ ఎస్సై ఉమా మహేశ్వరి

అంబర్‌పేట: బాలికల భద్రతపై పాఠశాల యాజమాన్యం అవగాహన పెంపొందించుకోవాలని షీ టీమ్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరి అన్నారు. మంగళవారం డీడీ కాలనీలోని బాచ్‌పన్ ఆకడమిక్ హైట్స్ పాఠశాలలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. సమాజంలో జరిగే సంఘటనలు వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రూపరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అంబర్‌పేట: పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు కేంద్ర సాయుధ బలగాల్లో ఉద్యోగాల నియామకానికి అవసరమైన శిక్షణను ఉచితంగా అందించనున్నారు. ఈ మేరకు రాంకీ ఫౌండేషన్ చైర్మన్ ముద్వ రాంరెడ్డి, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధులు గద్దె భాస్కర్, సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ 86 వేల ఉద్యోగాల భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీటీ లతో పాటు ఆర్‌పీఎఫ్ తదితర ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 22 లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 26న హైదరాబాద్, గుంటూరులో అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో 300, ఆంధ్రప్రదేశ్‌లో 300 మందికి ఎంపిక చేసి, వీరికి 5 నెలల పా టు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం సంస్థ ఫేస్‌బుక్, ట్విట్టర్‌లతో పాటు ఫోన్ 9703651233, 7337585959, 9000797789లలో సంప్రదించాలన్నారు.

కోడిగుడ్ల విక్రయదారుల మార్జిన్‌మనీ పెంచాలి



ముషీరాబాద్: కోడిగుడ్ల విక్రయదారులకు మార్జిన్ మనీ పెంచి ఆదుకోవాలని కోడిగుడ్ల సప్లయర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గురుమూర్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్‌కె ఫంక్షన్‌హాల్‌లో లోకల్ ఎగ్ సప్లయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో దాదాపు వెయ్యి కుటుంబాలు గుడ్ల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. తమకు ఏపీ తరహాలో రూ. 25 మార్జిన్ మనీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుల్తాన్, ఖాజా, లియాకత్, అబ్బూ, మహ్మద్‌ఖదీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

'మహాలక్ష్మి'తో మహిళల జీవితాల్లో వెలుగులు

- ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత మనోహర్‌సింగ్



ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకంతో మహిళల జీవితాల్లో నూతన వెలుగులు నిండుతాయని ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రతి ఇంటికి నెలకు రూ.10–12 వేల వరకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. మహిళలందరూ ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి కవాడిగూడ డివిజన్ డీబీఆర్ మిల్ కాలనీలో జరిగిన మహాలక్ష్మి మహిళా సదస్సుకు అంజన్‌కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామన్నారు. డీబీఆర్ మిల్ కాలనీతో పాటు అనేక బస్తీల్లో డ్రైనేజీ, మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తన హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తప్ప కొత్తగా గోపాల్ చేసింది ఏమీ లేదన్నారు. నియోజకవర్గానికి రూ.9 కోట్లు మంజూరైతే ప్రస్తుత ఎమ్మెల్యే వాటిలో కేవలం రూ.2 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బి బ్లాక్ అధ్యక్షులు విడి కృష్ణ, నాయకులు అంజయ్య, టి.కవిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం:

కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా మంగళవారం రాంనగర్, నెహ్రూనగర్, కల్లు కాంపౌండ్ వీధి, హోటల్ సునంద వెనుక వీధి, చిక్కడపల్లి కమాన్ వీధి, ఓడియన్ థియేటర్ వెనక వీధి, ఆజామాబాద్ ప్రాంతాలో ఎనిన్కల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించి అంజన్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

అంజన్‌కుమార్‌యాదవ్ గెలుపు తథ్యం

బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షులు ఎం.నర్సయ్య అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, తెలంగాణ జన సమితి నేతలు కలిసికట్టుగా పని చేసి అంజన్‌కుమార్‌యాదవ్‌ను గెలిపిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మనోహర్‌సింగ్...

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మనోహర్‌సింగ్ మంగళవారం అడిక్‌మెట్‌లో జరిగిన బహిరంగ సభలో అంజన్ కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

- గంగపుత్రులతో ఆత్మీయ సమ్మేళనం
- పలు ప్రాంతాల్లో పాదయాత్ర
- ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన
- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం


కాంగ్రెస్ నాయకుడు బాబర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: రాష్ట్రంలో సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి హాజరైన ముఠా గోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో 4.5 లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేసి దేశంలోనే రాష్ట్రాన్ని మత్స్య సంపదలో అగ్రగామిగా నిలిపారన్నారు. ఉప్పల్ భగాయత్‌లో మూడు ఎకరాల స్థలం, రూ.3 కోట్లు కేటాయించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, నాయకులు రాంచందర్, నర్సింగ్‌ప్రసాద్, శివకుమార్, పూస గోరఖ్‌నాథ్, గోవింద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు: దీటి మల్లయ్య...

రాష్ట్ర వ్యాప్తంగా గంగపుత్రులు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని చేపల మార్కెట్, గంగపుత్ర కాలనీలో బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీటి మల్లయ్య అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ఎస్ఎఫ్‌డీబీ నుంచి వెయ్యి కోట్లు విడుదల చేయించి మత్స్యశాఖ అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వరూప, రాజయ్య, ప్రసాద్, గణేష్, నర్సింగ్‌ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు టి.సోమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షులు బాబర్‌తో పాటు పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వై.శ్రీనివాస్‌రావు, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, రెబ్బ రామారావు, సయ్యద్‌షకీల్, రహీం తదితరులు పాల్గొన్నారు.


గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, గంగపుత్ర సంఘం నేతలు


కనకదుర్గమ్మ కల్యాణంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

కమనీయం..కనకదుర్గమ్మ కల్యాణం

వైభవంగా కొనసాగుతున్న కోటి దీపోత్సవం

కవాడిగూడ: కోటి దీపోత్సవం 8వ రోజు సందర్భంగా ఇంద్రకీలాద్రీపై కొలువుదీరిన కనకదుర్గమ్మ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం ఎన్‌టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ (అవధూత దత్తపీఠం మైసూర్), అనుగ్రహ భాషణం వినిపించగా, పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు ప్రవచనామృతం వినిపించారు. ప్రధాన వేదికపై కనకదుర్గమ్మకు వేద పండితులు కోటి గాజుల అర్చన చేస్తూ.. భక్తులచేత అమ్మవారి విగ్రహాలకు గాజుల అర్చన చేయించారు. అనంతరం అమ్మవారిని భక్తుల సందర్శనార్థం సింహవాహనంపై కోటి దీపోత్సవ ప్రాంగణంలో ఊరేగించారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ గవర్నర్‌ను సత్కరించి, ఆశీస్సులు అందజేశారు.


గవర్నర్‌కు ఆశీస్సులు అందజేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ